హెచ్‌బీ కాలనీలో ట్రా'ఫికర్'

- హైవేకు ప్రత్యామ్నాయంగా సీతమ్మధార మీదుగా పెరిగిన రాకపోకలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో స్థానికుల ఇబ్బందులు


హెచ్‌బీ కాలనీ కూడలి వద్ద నిలిచిపోయిన వాహనాలు

మద్దిలపాలెం: సీతమ్మధార–హెచ్‌బీ కాలనీ రోడ్డు ట్రాఫిక్ జామ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనచోదకులు చక్రబంధంలో చిక్కుకుపోయి సతమతమవుతున్నారు. జాతీయ రహదారి మీదుగా గురుద్వారా వయా సత్యం జంక్షన్ మీదుగా మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం వెళ్లే వాహనాలు ఆయా జంక్షన్ల వద్ద సిగ్నల్ ఉండడంతో వాటిని తప్పించుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గంగా హెచ్‌బీకాలనీ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో హోరెత్తిపోతోంది.

నాలుగు సిగ్నల్స్ తప్పుంచుకోవాలని..

జాతీయ రహదారి మీదుగా వెళ్లే మార్గంలో సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఉన్నాయి. ఈ సిగ్నల్‌ను తప్పించుకోవడానికి సత్యం జంక్షన్ నుంచి వయా సీతమ్మధార మీదుగా హెచ్ కాలనీ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ మార్గం నిత్యం రద్దీగా మారింది. దీంతో వాహన కాలుష్యంతో పాటు, ధ్వని కాలుష్యం పెరిగిపోయిందంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

- హెచ్‌బీ కాలనీ నుంచి వెంకోజీపాలెం జాతీయ రహదారి వరకూ ఉన్న మార్గం మధ్యలో యల్లమాంబ కాలనీ వద్ద రోడ్డు చిన్నది కావడంతో వాహనాలు రద్దీతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ క్రమంలో పాదచారులు సైతం రోడ్డు దాటలేని పరిస్థితి నెలకుంది. ఈ రహదారి విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



సీతమ్మధార నుంచి వెంకోజీపాలెం రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులను నియంత్రించాలని ట్రాఫిక్ విభాగం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ రోడ్డును జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా వాహనదారులు ఉపయోగించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే భారీ వాహనాలను ఈ రోడ్డు మీదుగా అనుమతించవద్దని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరాం.

– అప్పారి శ్రీవిద్య, 15వ వార్డు కార్పొరేటర్

వాహనాల రద్దీని నియంత్రించాలి



హెచ్‌బీ కాలనీ రోడ్డుకు ఇరు వైపులా పలు కాలనీలు ఉన్నాయి. కాలనీ నుంచి బయటకు వెళ్లాంటే వాహనాల హారన్ల మోతతో పాటు, ట్రాఫిక్‌తో పడరాని పాట్లు పడుతున్నాం. ఉదయం వేళల్లో పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నాం. ఈ మార్గంలో వాహనాల రద్దీని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

– గొలగాని శ్రీనివాసరావు, పాత వెంకోజీపాలెం

క్లుప్తంగా

ముగిసిన విద్యార్థుల కామెడీ వర్క్‌షాప్


విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నరవ ప్రకాశరావు

ఎంవీపీ కాలనీ: స్థానిక వీఎంసీ కళాశాలలో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాస్య ప్రియ కామెడీ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న కామెడీ వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర యాక్టివిటీస్ అందించాలనే లక్ష్యంతో ఈ వర్క్‌షాపును నిర్వహించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఆటవిడుపుగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఈ వర్క్‌షాపులో శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఈశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు, డాక్టర్ అప్పారావు, లక్ష్మీదేవి, కృష్ణ పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి


బీఎన్‌ఆర్ నగర్‌లో పుచ్చలపల్లి వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

ఆరిలోవ: దివంగత సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య మంచి పోరాట యోధుడని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి రవీంద్రనగర్ దరి బీఎన్‌ఆర్ నగర్‌లో శుక్రవారం ఆరిలోవ సీపీఎం జోన్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలు తెలుసుకొని వారి తరఫున పోరాడాలనే దృఢ నిశ్చయం కలిగిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు జోన్ సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీజీని సందర్శించిన డీఎంహెచ్‌వో


హెచ్‌సీజీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఆరిలోవ: హెల్త్ సిటీలో పినాకిల్ పరిధిలో ఉన్న హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న క్యాన్సర్ బాధితులతో ఆయన నేరుగా మాట్లాడారు. అందుతున్న వైద్యం, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో రికార్డులు, రోగుల రిపోర్టులు తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణపై అక్కడ నిర్వాహకులు, వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్శనలో డీపీఎంవో డాక్టర్ ఎన్.రమారెడ్డి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమాపతి పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగించరూ..

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో పలు చోట్ల వీధి దీపాలు వెలగడంలేదని స్థానికులు సచివాలయాల్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పెదగదిలిలో విఘ్నేశ్వర సేవా సంఘం, బాలమురళీకృష్ణ యాదవ సేవా సంఘం, ఈశ్వరి దేవీనగర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానికులు సంబంధించిన సచివాలయాల్లో రాత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. ఆయా ప్రాంతాలలో 72ఏ, 256ఏ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో వీధి దీపాలు కొన్ని నెలలుగా వెలగడంలేదని, జీవీఎంసీ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఏయూ సమాచారం

శ్రావణికి యోగ శిరోమణి పురస్కారం


శ్రావణిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగ విభాగం పరిశోధకురాలు డాక్టర్ చిట్టూరి శ్రావణికి ప్రతిష్టాత్మక యోగ శిరోమణి పురస్కారం లభించింది. ఈ సందర్భంగా శ్రావణిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. నెల రోజుల పాటు ఉత్తర కాశీలో యోగ వేదాంత ఫారెస్ట్ అకాడమీ, శివానంద యోగ వేదాంత ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని కఠోర యోగా సాధన చేశారు. యోగాకు విస్తృత ప్రాచుర్యం తీసుకురావడానికి శ్రావణి చేస్తున్న కృషిని గుర్తిస్తూ శివానంద యోగ వేదాంత ఆశ్రమం యోగ శిరోమణి పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, చిట్టూరి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ శాస్త్ర నిపుణులకు విస్తృత అవకాశాలు


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: వాతావరణ శాస్త్ర నిపుణులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం సముద్ర వాయు పేరుతో నిర్వహించిన విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏయూ దశాబ్దాలుగా ఈ రంగానికి ఎందరో నిపుణులను అందిస్తోందన్నారు. సముద్ర అధ్యయన శాస్త్రం ఎంతో సంక్లిష్టమైందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కోర్సు అభ్యసించిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా సకాలంలో సెమిస్టర్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.సునీత, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భట్టి

ఏయూ క్యాంపస్: ఉన్నత్ భారత్ అభియాన్ నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్ రూరల్ ఏరియాస్ అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో బీటెక్ సీఎస్ఈ విద్యార్థిని జ్ఞాన ప్రియ ప్రథమ, జి.ప్రిషిల్ల ద్వితీయ, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఎ.వెన్నెల తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి అభినందించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

డాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి రెండు, జోన్–3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు యోగా తరగతులు


యోగా చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

దొండపర్తి: బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీసులకు యోగా తరగతులు నిర్వహించారు. పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడికి గురి కాకుండా మానసికంగా దృఢంగా ఉండేందుకు సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీ(ఏఆర్) ఆర్.పి.ఎల్.శాంతికుమార్, ఆర్ఐలు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. పని ఒత్తిడి నుంచి బయటపడి మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం, సిబ్బందికి మనోధైర్యం పెంపొందే పలు మార్గాలను బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు వివరించారు.

'ఉక్కు' పోరాటంలో భాగస్వామ్యం కావాలి



ప్లకార్డుతో బొత్స ఝాన్సీలక్ష్మి, హేమంత్‌కుమార్

బీచ్ రోడ్డు: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో భాగస్వామ్యం కావాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కోరారు. ఈ మేరకు సిరిపురంలోని ఆమె నివాసంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యతిరేక పోరాటానికి మద్దతు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు.

వర్షంతో ఉపశమనం

మద్దిలపాలెం: ఉరుములు, మెరుపులతో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం వేసవి తాపం నుంచి ఊరటనిచ్చింది. ఉష్ణోగ్రతలు గత వారం రోజులుగా పెరిగిపోతుండడంతో నగరవాసులు విలవిలలాడారు. భానుడి ప్రతాపానికి మధ్యాహ్నానికి మద్దిలపాలెం, శివాజీపాలెం, హెచ్‌బీకాలనీ కూడళ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉన్నట్టుండి ఒకసారిగా వర్షం కురవడంతో వేడి నుంచి ఉపశమనం పొందారు.


ఎంవీపీ కాలనీ రోడ్ల ఆక్రమణపై కన్నెర్ర

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో రోడ్ల ఆక్రమణపై జీవీఎంసీ అధికారులు కన్నెర్ర చేశారు. రోడ్లపైకి వచ్చి ఏర్పాటు చేసిన దుకాణాలను శుక్రవారం తొలగించారు. కొందరు వ్యాపారులు రోడ్ల మధ్య వరకు దుకాణాలు పెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో వస్తున్న ఫిర్యాదుల మేరకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఫుట్‌పాత్‌లపై షాపులను తొలగించాలంటూ ఇటీవల వార్డు పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ సైతం సూచించడంతో ఈ చర్యలకు ఉపక్రమించారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ నుంచి క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డు వరకు ఉన్న ఆక్రమణలను తొలగించారు. అనంతరం కొలతలు వేసి జీవీఎంసీ సూచించిన దాని కంటే రోడ్డుపైకి దుకాణ కార్యకలాపాలు సాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో సాగర ఘోష

ఎంవీపీ కాలనీ: బీజేపీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంవీపీ కాలనీ జాలరి ఎండాడలో సాగర ఘోష కార్యక్రమం నిర్వహించారు. సముద్రంలో కలుషిత జలాలు, గెడ్డల మురుగునీరు నేరుగా కలవకుండా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు కలుషి జలాలు, తీరప్రాంత వ్యర్థాల వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో వ్యర్థజలాలు నేరుగా కలవకుండా జీవీఎంసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టెంట్ హౌస్ దగ్ధం


షాపు నుంచి ఎగసిపడుతున్న మంటలు

మల్కాపురం: విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శ్రీనివాసనగర్లో గురువారం అర్ధరాత్రి ఓ టెంట్ హౌస్ నుంచి మంటలు ఎగసి పడ్డాయి. షాప్‌ను ఆనుకుని పక్కనే ఉన్న ఓ ఇంటి హౌస్ వైరింగ్ దగ్ధమైంది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. మల్కాపురం పోలీసులు చెప్పిన వివరాలు. శ్రీనివాస్‌నగర్‌లో శ్రీను అనే వ్యక్తి సప్లయర్స్(టెంట్ హౌస్) దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి తన షాపును మూసేసి, ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షాపు నుంచి మంటలు రావటం మొదలైంది. దాన్ని చూసిన స్థానికులు మంటల్ని ఆపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో పెదగంట్యాడ అగ్నిమాపక అధికారులకు, మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శకటం మంటల్ని ఆర్పేసినా, అప్పటికే సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదానికి కారణాలను అగ్నిమాపక అధికారులు చెప్పలేకపోతున్నారు. దీనిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో


ఇసుకతోట కూడలిలో రాస్తారోకో చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: పేదలకు ప్రభుత్వం ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి కూడా సరిపోదంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఇసుకతోట కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయించడం చంద్రబాబుకు మింగుడు పడటంలేదన్నారు. అందుకే దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అమరావతిలో పేదలకు చోటు లేకుండా చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని చెప్పారు. ముఖ్యమంత్రి సంకల్పంతో త్వరలోనే అక్కడ పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. చంద్రబాబు తాను చేసిన అప్రజాస్వామిక, అహంకారపూరిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అక్కరమాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, వార్డుల ఇన్‌చార్జ్‌లు, పలు సంఘాల డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు


హనుమంతవాక కూడలిలో వాహనదారుడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న అధికారులు

ఆరిలోవ: మద్యం తాగి వాహనాలు నడపకూడదని డీటీసీ రాజరత్నం సూచించారు. యునైటెడ్ నేషన్ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం హనుమంతవాక కూడలి వద్ద రవాణా శాఖాధికారులు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వాహనచోదకులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో మద్యం తాగి డ్రైవ్ చేస్తున్నట్లు నిర్ధారణ జరిగిన ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపేవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీసీ రాజరత్నం మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం వల్ల ఎక్కువ మంది రోడ్డు ప్రమాదానికి కారణమవుతున్నారన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపకూడదన్నారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించిన పోస్టరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవోలు రామ్‌కుమార్, వేణుగోపాలరావు, మోటార్ వాహన తనిఖీదార్లు బుచ్చిరాజు, శ్రీనివాస్, సుమన్‌కుమార్, ఎబిలిటీ పీపుల్ అధినేత దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్‌లో యథేచ్ఛగా చెట్ల నరికివేత


సంజయ్‌గాంధీ కాలనీలో షిర్డీ సాయిబాబా ఆలయం ముందు కారిడార్‌లో నరికేసిన చెట్లు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు పెదగదిలి సమీప సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఉన్న మార్గంలో పచ్చదనం హరించుకుపోతోంది. పదుల సంఖ్యలో చెట్లు, మొక్కలు కత్తి వేటుకు గురయ్యాయి. సాధారణంగా ఆలయాలు ముందు, చుట్టు పక్కల పచ్చదనం, నీడ కోసం చెట్లు పెంచుతారు. వాటి నీడలో భక్తులు సేదదీరేలా చర్యలు చేపడతారు. కానీ ఇక్కడ బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని షిర్డీ సాయిబాబా ఆలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లే భక్తులు వాహనాలు నిలపడానికి పార్కింగ్ స్థలం గానీ, మొక్కలు పెంచడానికి కూడా స్థలం లేదు. దీంతో ఆలయం ముందు బీఆర్‌టీఎస్ రోడ్డులో విశాలమైన కారిడార్‌లో ఉన్న మొక్కలను ఆలయ నిర్వాహకులు తొలగించేస్తున్నారు. వాటిలో సుమారు 30 నుంచి 40 వరకు వరకు బాగా పెరిగిన చెట్లతో పాటు ఎదుగుతున్న మొక్కలు ఉన్నాయి. వీటిలో వేప, నేరేడు, నిద్రగన్నేరు, తదితర చెట్లు ఉన్నాయి. ఈ విషయాన్ని స్థానికులు సంబంధిత సచివాలయ సిబ్బందికి రెండు రోజులు క్రితం ఫిర్యాదు చేశారు. అయినా ఇక్కడ చెట్లు నరకడం ఆపలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఇక్కడ పిల్లలు ఆడుకోవడానికి వెళ్తే పచ్చదనం నాశనమవుతుందంటూ జీవీఎంసీ అధికారులు అడ్డుకున్నారని, ఇప్పుడు చెట్లు నరికేస్తున్నా అదే అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. కారిడార్‌లో గ్రీన్ బెల్ట్ కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన పచ్చదనం నాశనం చేయడం మంచి విధానం కాదని అంటున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థుల ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుంజే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కళాశాల నుంచి 18 మంది బాలికలు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా.. 9 మంది ఉద్యోగాలు సాధించారు. వీరు జూలై 1న ఉద్యోగాల్లో జాయిన్ అవుతారు. కెమికల్ ఇంజినీరింగ్, ఆయిల్ టెక్నాలజీ నుంచి ముగ్గురు చొప్పున, ఇతర బ్రాంచిల నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరికి రూ.3.6లక్షల వార్షిక వేతనాన్ని కంపెనీ ఆఫర్ చేసినట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. బుంజే కంపెనీ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ ఎ.దక్షిణామూర్తి, మేనేజర్లు ఎన్.శ్రీరామిరెడ్డి, అనీష్ జోషి పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులు గైస్ లోగో వద్ద సెల్ఫీ దిగారు.

దోమల నివారణకు డ్రైడే పాటించాలి


మద్దిలపాలెంలో పరిసరాలను పరిశీలిస్తున్న మలేరియా సూపర్‌వైజర్ వై.వి.ఎస్.రత్నం


అంజయ్యనగర్‌లో నీటిని పరిశీలిస్తున్న వై.మణి తదితరులు

మద్దిలపాలెం : దోమల ఉత్పత్తిని నివారించడానికి డ్రైడే పాటించాలని మలేరియా సూపర్‌వైజర్ వై.వి.ఎస్.రత్నం సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం మద్దిలపాలెం ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ పరిసరాలలో వారానికి పైగా నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమ కాటు వల్ల డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శేషుబాబు, ఇసుకతోట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంజయ్యనగర్‌లో..

ఎంవీపీ కాలనీ: జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని 18వ వార్డు అంజయ్యనగర్‌లో డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ దోమలు పెరిగే ప్రదేశాలు, జ్వరాల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా మలేరియా అధికారి వై.మణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.